WWW.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

6-2-2025





## గొంగడి త్రిషకు పొంగులేటి అభినందన

- త్రిష, అద్భుత ప్రదర్శనతో టీమ్‌ను ముందుకు నడిపింది
- క్రీడల్లో ప్రతిభావంతులైన యువతకు ప్రభుత్వం అండగా ఉంటుంది

02




## ఇంజినీరింగ్ నుంచి జ్యోతిష శాస్త్రం వరకు

- విశిష్ట గౌరవం అందుకున్న హరి ఉమాకాంత రావు
- ఖమ్మం జిల్లాకు గర్వకారణమైన ఘనత
- ఇంజినీరింగ్ నుంచి నీటి పారుదల శాఖ వరకు ప్రస్థానం
- వాస్తు, జ్యోతిషంపై లోతైన పరిశోధన
- "జ్యోతిష ఋషి" బిరుదుతో సత్కారం

05

# ప్రణాళికతో చదివి విజయం సాధించాలి




**ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ పెట్టి బయటి ఫుడ్ తీసుకోవడం మానివేయాలి**

- జీవితంలో సులభంగా ఏది రాదు వచ్చినా మన దగ్గర ఉండదు.
- పనులు వాయిదా అలవాటు పడితే లక్ష్యాలను చేరుకోలేం
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, మహా

జీవితంలో విద్యార్థులు ప్రణాళికతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యం సాధించడంలో విజయవంతం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, స్థానిక ఎన్.ఎస్.పి. క్యాంప్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన, మోటివేషన్ తరగతులను పరిశీలించారు.

03



## ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి

**ఖమ్మం క్రైమ్, ఫిబ్రవరి 5, మహా:** ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పట్టుబడుతున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు.

04

FOLLOW: @ANNTELUGU
6-2-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# గొంగడి త్రిషకు పొంగులేటి అభినందన

**త్రిష, అద్భుత ప్రదర్శనతో టీమ్‌ను ముందుకు నడిపింది**

**క్రీడల్లో ప్రతిభావంతులైన యువతకు ప్రభుత్వం అండగా ఉంటుంది**



**ఖమ్మం, ఫిబ్రవరి 5, మహా:** హైదరాబాద్‌లో బుధవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అండర్–19 మహిళల క్రికెట్ ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఖమ్మం జిల్లా యువ క్రికెటర్ గొంగడి త్రిష ఘనంగా సన్మానితమైంది. బీసీసీఐ ఆధ్వర్యంలో దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచకప్‌లో భారత యువటీమ్‌కు కీలక ఆటగాళ్లలో ఒకరిగా నిలిచిన త్రిష, అద్భుత ప్రదర్శనతో టీమ్‌ను ముందుకు నడిపింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ఖమ్మం మట్టిలో జన్మించిన త్రిష అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం గర్వకారణమన్నారు. క్రీడల్లో ప్రతిభావంతులైన యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. క్రికెట్‌లో ఉన్న ఆసక్తిని అభివృద్ధి చేసుకోవడానికి యువతకు మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. త్రిషను ఆదర్శంగా తీసుకుని మరింత మంది యువత ఈ క్రీడా రంగంలో ముందుకు రావాలని మంత్రి ఆకాంక్షించారు.

## ఖమ్మం నుంచి ప్రపంచస్థాయికి...

ఖమ్మం జిల్లాలోని భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతానికి చెందిన గొంగడి త్రిష చిన్నతనం నుంచే క్రికెట్‌పై ఆసక్తిని కనబరిచింది. తండ్రి మద్దతుతో ఆమె ప్రాథమికంగా క్రికెట్‌ను అభ్యసించడంతో పాటు జిల్లాస్థాయి టోర్నమెంట్లలో చురుకుగా పాల్గొంది. అండర్–16, అండర్–19 స్థాయిలో అద్భుత ప్రదర్శన చేయడంతో బీసీసీఐ దృష్టిని ఆకర్షించిన త్రిష, ప్రపంచకప్ బృందంలో చోటు దక్కించుకుంది. కీలక మ్యాచ్‌లలో ఆడిన విధానం ఆమెకు ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది.

### భవిష్యత్తు లక్ష్యం...

ప్రపంచకప్‌లో గెలిచిన తర్వాత త్రిష భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని సంకల్పం వ్యక్తం చేసింది. భారత మహిళా క్రికెట్ జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఎదగాలన్నదే తన లక్ష్యమని చెప్పింది. క్రమశిక్షణ, కఠినమైన శిక్షణతో ముందుకు సాగి భారత జట్టులో స్థిర స్థానం సంపాదించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు వెల్లడించింది.

### ఖమ్మం క్రీడా అభివృద్ధి

ఖమ్మం జిల్లాలో యువ క్రీడాకారులకు అవసరమైన వసతులు, మెరుగైన శిక్షణ కేంద్రాలు అందించాల్సిన అవసరముందని క్రీడా విశ్లేషకులు పేర్కొన్నారు. త్రిష వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ హస్తం ద్వారా మరిన్ని అవకాశాలు కల్పించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### క్రికెట్‌లో ఖమ్మం పసిడి వెలుగు

గొంగడి త్రిష విజయంతో ఖమ్మం జిల్లా మరొకసారి క్రీడా రంగంలో తన సత్తా చాటుకుంది. ఆమె ప్రదర్శన యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలుస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి, అక్కడి నుంచి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను ప్రదర్శిం చిన త్రిష, భవిష్యత్తులో భారత క్రికెట్‌కు మరో గొప్ప ఆటగాళ్లను అందించనుందని భావిస్తున్నారు.

### స్వాగతం - సన్మానం...

హైదరాబాద్‌లో జరిగిన అభినందన కార్యక్రమానికి పలువురు క్రీడాప్రేమికులు, ప్రముఖులు హాజరయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన త్రిషకు ఘన స్వాగతం పలుకుతూ, ఆమె ప్రతిభను కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తూ, మరింత ముందుకు వెళ్లేలా చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.



# గొంగడి త్రిషను అభినందించిన ప్రముఖులు

**ఖమ్మం, ఫిబ్రవరి 5, మహా:** అండర్–19 మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, వుమన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన ఖమ్మం జిల్లా కీర్తి గొంగడి త్రిషను బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘు రామ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, టి జీ ఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. వరల్డ్ కప్‌లో కీలక ప్రదర్శన కనబరిచి, దేశానికి గౌరవాన్ని తెచ్చిన త్రిష ప్రతిభను ప్రశంసించిన ప్రజా ప్రతినిధులు, ఆమె భవిష్యత్‌లో మరింత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. దేశం గర్వించదగిన క్రీడాకారిణిగా తన కృషితో ఖమ్మం పేరు నిలిపిందని అన్నారు. త్రిషను మెచ్చుకుంటూ, ఆమెకు అన్ని విధాలుగా మద్దతునివ్వాలని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. భారత మహిళా క్రికెట్‌లో త్రిష వంటి యువ ప్రతిభావంతుల ప్రస్థానం మరింత విస్తరించాలని అభిలాషించారు.

# క్లినికల్ అప్రెంటిస్షిప్ శిక్షణ కొరకు ఫిబ్రవరి 15లోగా దరఖాస్తు చేసుకోవాలి

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు

**ఖమ్మం, మహా:** ఇంటర్మీడియట్ ఎం.పీ. హెచ్.డబ్ల్యూ (ఫిమేల్ ) ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి ఒక సంవత్సరం క్లినికల్ అప్రెంటిస్ షిప్ శిక్షణ ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు ఆసుపత్రి పేరునా డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకొని ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు తమ బయోడేటా ఫారంతో పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామా కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి కలెక్టరేట్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఈనెల 15 లోగా అందజేయాలని రవి బాబు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గొర్ల సంజీవరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక

**సత్తుపల్లి, జనవరి 5: మహా:** సత్తుపల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. స్థానిక ఎన్నికలు సమీపించడంతో ప్రత్యర్థులను సైతం ఆకర్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరికలకు నాంది పలుకుతున్నారు. దీనిలో భాగంగా వేంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి తన అనుచర గణంతో కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ పదవులు ఆశించి పార్టీ మారలేదని ప్రజాసేవ చేయడానికి ప్రజా ప్రభుత్వంలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉడతనేనీ అప్పారావు, చలగళ్ల నరసింహారావు,గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకులు కందుకూరు గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధాన్యం బోనస్, రుణమాఫీ బ్యాంకు ఖాతాలకు వెంటనే జమ చేయాలి



**ఖమ్మం సిటి, ఫిబ్రవరి 5, మహా:** ధాన్యం బోనస్, రుణమాఫీ, రైతు భరోసా డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు వెంటనే జమ చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మం సుందరయ్య భవన్లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం లో రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రైతు రుణమాఫీ 60%, ధాన్యం బోనస్ 70%, రైతు భరోసా 96% పెండింగ్లో ఉందని అన్నారు . రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు అందించే రైతు బంధు పేరు మార్చి భరోసా చేసిన మూడు వ్యవసాయ సీజన్లో రైతులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉంటే ఒక సీజన్లో మాత్రమే రైతు భరోసా విడుదల చేసింది అన్నారు, రెండు సీజన్ ల పెండింగ్ ఉంటే పెంచిన మొత్తం తో వేయాల్సి ఉండగా కేవలం సగం మాత్రమే మండలం లో అతి చిన్న రెవెన్యూ గ్రామం లో రైతులకు భరోసా విడుదల చేసి మిగితా గ్రామాలను పెండింగ్లో ఉంచారు అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు, తాతా భాస్కరరావు,బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్,ఎస్ కె మీరా, దుగ్గి కృష్ణ సహాయ కార్యదర్శులు గోడవర్తి నాగేశ్వరరావు బిక్కసాని గంగాధర్, సభ్యులు శీలం సత్యనారాయణ రెడ్డి,మల్లేల సన్మధరావు, బాణాల శ్రీనివాసరావు, బింగ్గి రమేష్,కుసుపూడి మధు ,కోల్లేటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే బీసీలకు సంపూర్ణ న్యాయం



**బోనకల్, ఫిబ్రవరి 5, మహా:** సీల హక్కుల సాధనలో ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్లు బలహీన వర్గాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు అన్నారు. బుధవారం మహా న్యూస్ తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దేశ బిసి కుల గణనకు మరింత బలం చేకూరుస్తుందనీ అన్నారు. షెడ్యూల్ క్యాస్ట్ కు సంబంధించి కూడా వర్గీకరణ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం మరో చారిత్రక నిర్ణయమని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలు పొంతన లేని మాటలు కుల గణనపై అనవసర రాద్ధాంతాలు రాష్ట్రానికి కీడు చేస్తాయి తప్ప న్యాయం చేయలేవనీ అన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌కి గురైన పంచాయతీ కార్యదర్శి

**బోనకల్, ఫిబ్రవరి 5, మహా:** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న ఎం రాధాకృష్ణ బుధవారం బ్రెయిన్ స్ట్రోక్ తో అసాధారణ హాస్పిటల్లో అత్యవసర వైద్య చికిత్స తీసుకుంటున్నారు. రాధాకృష్ణ పరిస్థితి విషమించటంతో హైదరాబాదుకు తీసుకువెళ్లాలని వైద్యులు రిఫర్ చేయడం జరిగింది. విధి నిర్వహణలో ఎప్పుడు ఉత్సాహంగా ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న రాధాకృష్ణ ఒక్కసారిగా అనారోగ్యానికి గురి కావడంతో తోటి పంచాయతీ కార్యదర్శులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఉన్నతాధికారులు రాధాకృష్ణ త్వరగా కోలుకొని మళ్లీ తన కుటుంబంతో సంతోషంగా ఉంటూ,యధావిధిగా తన ఉద్యోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.







# ప్రణాళికతో చదివి విజయం సాధించాలి

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ పెట్టి బయటి ఫుడ్ తీసుకోవడం మానివేయాలి

జీవితంలో సులభంగా ఏది రాదు... వచ్చినా మన దగ్గర ఉండదు

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



## ఎన్ని ఆటంకాలు వచ్చిన లక్ష్యాలను విస్మరించవద్దు

విద్యార్థులు నమ్మకంతో పరీక్షలు రాయాలని, జీవితంలో మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎన్ని ఆటంకాలు వచ్చిన సాధించాలని, గొప్ప స్థాయికి చేరుకున్న తర్వాత ఇతరులకు సహాయం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకుముందు మోటివేషన్ స్పీకర్ నాగేశ్వర్ రావు పిల్లలకు నిర్వహించిన అవగాహన, మోటివేషన్ తరగతిని జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చొని ఆసక్తిగా విన్నారు. విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించి తమ తల్లిదండ్రులకు జీవితాంతం గుర్తుండేలా మంచి బహుమతిని అందించాలని, జీవితం అందమైనదని, ప్రణాళికా ప్రకారం ముందుకు వెళ్లి భవిష్యత్తులో మంచి స్థానంలో ఉండాలని, కోపం, సోమరితనం వీడి ఎప్పటి పనులు అప్పుడు చేసే విధంగా అలవాటు చేసుకోవాలని, సెల్ ఫోన్ వాడకం తగ్గించాలని, నెల రోజులపాటు పూర్తిగా ముట్టుకోవద్దని, మనం చేయగలమనే కాన్ఫిడెన్స్ ను పెంచుకోవాలని, మనం అనుకుంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు.

**ఖమ్మం, ఫిబ్రవరి -05,మహా:** జీవితంలో విద్యార్థులు ప్రణాళికతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యం సాధించడంలో విజయవంతం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, స్థానిక ఎన్.ఎస్.పి. క్యాంప్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన, మోటివేషన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వేగంగా నడిపితే ప్రమాదాలు జరుగుతున్నాయనే భయం చాలా మంచిదని, భయం అనేది సర్వ సాధారణ మని, ప్రతి మనిషికి భయం ఉంటుందని, సమయంతో భయాన్ని ఎలా మేనేజ్ చేయాలో నేర్చుకోవాలని అన్నారు. అలాగే పరీక్షల గురించి భయం తగ్గాలంటే ముందు నుంచే ప్రణాళికతో చదవాలని అన్నారు. మనకు జీవితంలో ఏది సులభం కాదని, శ్రమ లేకుండా వస్తే మనకు విలువ ఉండదని అన్నారు. నిర్దేశిత లక్ష్యం మేరకు క్రమ పద్ధతిలో కష్టపడాలనీ, ఈ రోజు పని రేపటికి వాయిదా వేయవద్దని, పనులు వాయిదా అలవాటు పడితే లక్ష్యాలను చేరుకోలేమని, జీవితంలో సరైన సమయంలో లక్ష్యం దిశగా పని చేయకపోతే గొప్ప భవిష్యత్తు కోల్పోతామని అన్నారు. రాబోయే నెల రోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తీసుకోవాలని, బయట జంక్ ఫుడ్, చిప్స్ తిన వద్దని, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని అన్నారు. మనం ఎంత పరీక్షకు సిద్ధమైన ఆరోగ్యంగా లేకుంటే ఆశించిన ఫలితాలు సాధించలేమని ఆరోగ్యాన్ని చూసుకోవడం కూడా కీలకమని కలెక్టర్ తెలిపారు. మన లక్ష్యాలను ఎలా సాధించాలి అనే దానిపై దృష్టి పెట్టాలని, లేని వాటి గురించి ఆలోచిస్తూ కూర్చుంటే వైఫల్యాలే వస్తాయని, మన వైఫల్యాలకు ఇతరులను ఎప్పుడూ దూషించవద్దని, ఎక్కడ పుట్టాం, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగాం వంటి అంశాలు మన చేతిలో లేవని, పరీక్షలలో మనం ఎలా రాస్తామనే అంశం మాత్రమే మనపై ఆధారపడి ఉంటుందని, మన పనిని మనం జాగ్రత్తగా, సరిగ్గా చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు తమపై నమ్మకం పెట్టుకోవాలని, ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని, మన స్నేహితులు ఏ సబ్జెక్టులో వీక్ గా ఉన్నారో అందులో వారికి అవసరమైన శిక్షణ అందించాలని, మనతో పాటు మన స్నేహితులు కూడా బాగా పరీక్షలు రాసేలా వారిని సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యా యులు రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
6-2-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు




# ఇంజినీరింగ్ నుంచి జ్యోతిష శాస్త్రం వరకు

| విశిష్ట గౌరవం అందుకున్న హరి ఉమాకాంత రావు | ఖమ్మం జిల్లాకు గర్వకారణమైన ఘనత | ఇంజినీరింగ్ నుంచి నీటి పారుదల శాఖ వరకు ప్రస్థానం | వాస్తు, జ్యోతిషంపై లోతైన పరిశోధన | జ్యోతిష ఋషి బిరుదుతో సత్కారం |
|---|---|---|---|---|

**ఖమ్మం, ఫిబ్రవరి 5, మహా:** గ్రామీణ నీటి పారుదల శాఖలో విశేష సేవలందించి, మిషన్ భగీరథ రూపకర్తగా పేరుగాంచిన హరి ఉమాకాంత రావు తాజాగా ఫ్లోరిడా ఇంటర్నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ నుండి జ్యోతిష శాస్త్రంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. మహర్షి వేదిక్ కాలేజీ ఆఫ్ ఆస్ట్రోలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన పరిశోధనలో "జ్యోతిషం, వాస్తులో మూఢనమ్మకాలు, అపోహలు" అనే అంశంపై ఆయన లోతైన అధ్యయనం చేసి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు.

### ఖమ్మం జిల్లాకు గర్వకారణమైన ఘనత...


ఇంజినీరింగ్ రంగంలో తన విశిష్ట ప్రతిభతో ఖమ్మం జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించిన హరి ఉమాకాంత రావు, ఉద్యోగ విరమణ అనంతరం జ్యోతిష శాస్త్రంపై ఆసక్తి కనబర్చారు. సాంప్రదాయ జ్యోతిష శాస్త్రాన్ని, వాస్తును ఆధునిక శాస్త్రంతో అనుసంధానం చేయడం ఆయన పరిశోధన లక్ష్యం. మూఢనమ్మకాలు, అపోహల వల్ల సమాజంలో ఏర్పడే భయాందోళనలను పరిశీలిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని జనాల్లో బలపరిచే దిశగా ఆయన పరిశోధనలు కొనసాగించారు.

### ఇంజినీరింగ్ నుంచి నీటి పారుదల శాఖ వరకు ప్రస్థానం

ఖమ్మం జిల్లాలో జన్మించిన హరి ఉమాకాంత రావు ఇక్కడే ప్రాథమిక విద్య పూర్తిచేసి, వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఇరిగేషన్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. అప్పటి ఇరిగేషన్ శాఖలో జూనియర్ ఇంజనీర్‌గా చేరి, తన ప్రథమ నియామకం ఖమ్మం జిల్లాలోనే జరిగింది. తాలిపేరు ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక బాధ్యతలు నిర్వహించారు. జిల్లాలోని అనేక చెరువుల పునరుద్ధరణకు ఆయన విశేష కృషి చేశారు. 1986లో గిరిజన సంక్షేమ శాఖ పాల్వంచలో పనిచేసిన హరి ఉమాకాంత రావు చెక్ డ్యామ్‌లు, రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టి, గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారు. 1997 నుండి గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, పర్యవేక్షక ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, ఈ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మల గ్రామ పురస్కారాల్లో జిల్లా దేశంలో ప్రథమ స్థానంలో నిలవడం వంటి విజయాలు సాధించారు.

### వాస్తు, జ్యోతిషంపై లోతైన పరిశోధన...

ఉద్యోగ విరమణ అనంతరం హరి ఉమాకాంత రావు వాస్తు, జ్యోతిషంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి లోతైన అధ్యయనం ప్రారంభించారు. ఫ్లోరిడా యూనివర్సిటీకి సమర్పించిన "జ్యోతిషం, వాస్తులో మూఢనమ్మకాలు, అపోహలు" అనే అంశంపై పరిశోధనకు గౌరవ డాక్టరేట్ లభించడం విశేషం. వాస్తు, జ్యోతిషశాస్త్రాలను ప్రామాణికంగా సమాజానికి అందించాలనే లక్ష్యంతో ఆయన ఈ రంగాన్ని ఎంచుకున్నారు.



**జ్యోతిష ఋషి బిరుదుతో సత్కారం**

హైదరాబాద్ వేదిక పరిశోధన సంస్థ వారు ఇటీవల హరి ఉమాకాంత రావును "జ్యోతిష ఋషి" బిరుదుతో సత్కరించారు. బిర్లా ప్లానెటోరియంలో జరిగిన ఈ కార్యక్రమం లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి జ్యోతిష నిపుణుల సమక్షంలో ఆయనకు ఈ బిరుదు ప్రదానం చేశారు.

**జిల్లా వాసుల అభినందనలు**

ఇంజినీరింగ్ రంగంలో విశేష ప్రతిభ కనబరిచి, ఖమ్మం జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించిన హరి ఉమాకాంత రావు, జ్యోతిష పరిశోధనలోనూ తన ప్రతిభను నిరూపించుకుని అంతర్జాతీయ గౌరవాన్ని అందుకోవడం జిల్లా వాసులకు గర్వకారణంగా మారింది. పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేస్తూ, ఆయన విజయాలను శ్లాఘించారు.

## ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టిన ట్రాఫిక్ పోలీసులు



**ఖమ్మం క్రైమ్, ఫిబ్రవరి 5, మహా:** ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పట్టుబడుతున్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇటీవల కాలంలో రోడ్డుప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజు నగరంలో వాహనాల తనిఖీలు చేపడుతున్నారని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మద్యం మత్తులో వాహనాలను నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్ అని, అదేవిధంగా మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. గతంలో మైనర్ డ్రైవింగ్ చేస్తు పోలీసు వారికి పట్టుబడితే జరిమానా వేసి , తల్లిదండ్రులు కి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం జరిగిందని, ఇక నుంచి డ్రైవింగ్ చేస్తున్న మైనర్ల వాహనాలు సీజ్ చేసి, వారితో పాటు వారి తల్లిదండ్రులను న్యాయస్థానంలో హాజరు పరచడం జరుగుతుందని తద్వారా న్యాయస్థానం శిక్ష / జరిమానా విధించే అవకాశం వుంటుందని అన్నారు.

## బీసీల హక్కుల సాధనలో చారిత్రాత్మక నిర్ణయం



**మధిర రూరల్, ఫిబ్రవరి 5 , మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అభినందనీయమని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో బలహీన వర్గాలకు పూర్తి న్యాయం జరిగేలా చారిత్రాత్మకంగా కుల గణన చేపట్టడం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కుల గణనకు సంబంధించి తీసుకున్న నిర్ణయం బీసీల భవిష్యత్తును మరింత బలపరిచే విధంగా ఉందని, ఈ ప్రక్రియ ద్వారా బీసీల జనాభా గణనీయంగా వెలుగులోకి వస్తుందని తెలిపారు. బలహీన వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరిచేందుకు కుల గణన కీలక మైలురాయిగా మారిందని అన్నారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ పై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా మరో చారిత్రాత్మక ఘట్టమని సూరంశెట్టి కిషోర్ అభిప్రాయపడ్డారు. ఈ చర్యతో అసలైన సామాజిక న్యాయం అమలవుతుందని, వర్గీకరణ ద్వారా ప్రభుత్వ సహాయాలను లక్ష్యబద్ధంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.

## క్రిప్టో మోసాల పెరుగుదలపై రాష్ట్ర సైబర్ భద్రత విభాగం హెచ్చరిక

**ఖమ్మం , ఫిబ్రవరి 5 , మహా:** డిజిటల్ పెట్టుబడుల పేరుతో మోసాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సైబర్ భద్రత విభాగం ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. అక్రమ సంస్థలు ఆకర్షణీయమైన లాభాల వాగ్దానాలతో అమాయకులను మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నాయని అధికారులు వెల్లడించారు. హామీ ఇచ్చే లాభాలు, నకిలీ వేదికలు, మొబైల్ అనువర్తనాలు, చెల్లింపు ప్రచారాలతో మోసగాళ్లు ప్రజలను ఉచ్చులో పడేస్తున్నారని హెచ్చరించారు. అత్యధిక లాభాల ఆశ చూపి ఆన్‌లైన్ లావాదేవీలకు ప్రజలను ఆకర్షించే ముఠాలు పెరుగుతున్నాయి. మొదట చిన్న మొత్తంలో పెట్టుబడి చేసిన తరువాత కొన్ని రోజులపాటు నమ్మకాన్ని పెంచేలా లాభాలు చూపించి, భారీ మొత్తంలో నిధులు సమర్పించిన తరువాత ఖాతాలను నిలిపివేసే మోసపద్ధతులు అమలులోకి వస్తున్నాయని అధికారులు వెల్లడించారు. నకిలీ పెట్టుబడుల సంస్థలు, తప్పుడు డిజిటల్ నాణేలు, డిజిటల్ లావాదేవీలు పేరుతో మోసాలకు పాల్పడుతున్న తీరు ఇటీవల బహిర్గతమైంది. ప్రజలు తమ నిధులను పెట్టుబడి చేసే ముందు సంస్థ నాణ్యతను పూర్తిగా పరిశీలించాలని, అనుమానాస్పద లింకులు, ఆఫర్లు, నకిలీ వేదికలు, మొబైల్ అనువర్తనాలు ద్వారా మోసగాళ్లు అమాయకులను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. ప్రత్యేకించి అధిక లాభాలు, ప్రోత్సాహక రివార్డుల వంటి పథకాలను నమ్మడం చాలా ప్రమాదకరమని అధికారులు పేర్కొన్నారు. డిజిటల్ పెట్టుబడులు సురక్షితంగా ఉండాలంటే మౌలిక జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ భద్రత విభాగం సూచించింది. తమ ఖాతాల భద్రత కోసం బలమైన సంకేతపదాలను ఉపయోగించాలని, రెండు స్థాయిల రక్షణ అమలు చేయాలని అధికారులు తెలిపారు. అనుమానాస్పద లావాదేవీలు, నకిలీ లింకులు, గుర్తు తెలియని వేదికలు, అనధికారిక పెట్టుబడుల మాదిరిని ఉపయోగించరాదని హెచ్చరించారు.

FOLLOW: @ANNTELUGU
5-2-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

## శ్రీ శృంగేరి పీఠాధిపతి దర్శనం చేసుకున్న చైర్మన్ సీతారాములు



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 5 మహా:** కాశీ లో శ్రీ శృంగేరి పీఠాధిపతి ఉత్తరాధికారి 37 వ పీఠాధిపతి శ్రీశ్రీ విధుశేఖర భారతీ తీర్థ మహాస్వామి ని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు దర్శించుకున్నారు. కాశీలో బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... పీఠాధిపతి ని దర్శించుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కోన్నారు. పాడి పంటలతో కళకళలాడాలని.... ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకొత్తూరు మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరరావుకు నివాళులు



**నేలకొండపల్లి, ఫిబ్రవరి 5 మహా :** మండలం లోని మోటాపురం గ్రామానికి చెందిన రావెళ్ల వెంకటేశ్వరరావు సేవలు మరవలేనివి అని కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు పేర్కోన్నారు. మండలం లోని మోటాపురం లో బుధవారం ఆయన నివాసం లో వర్ధంతి కార్యక్రమం ను నిర్వహించారు. ఆయన చిత్ర పటం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... తన తండ్రి వెంకటేశ్వరరావు పేరున సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పై విస్తుతంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు రావెళ్ల దమయంతి, రావెళ్ల మాలతీ, రావెళ్ల సాయి పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల పట్ల అప్రమతంగా ఉండాలి

**నేలకొండపల్లి, ఫిబ్రవరి 5 మహా :** స్థానిక సంస్థల ఎన్నికల విధుల పట్ల అప్రమతంగా ఉండాలని నేలకొండపల్లి తహశీల్దార్ జె. మాణిక్యరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... ఎన్నికల సమయంలో ఎలాంటి వివాదాలకు వెళ్లవద్దని సూచించారు. బాధితులు చేసుకున్న దరఖాస్తులను నిష్పక్షపాతంగా వెరిఫికేషన్ చేయాలని అన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసే బాధ్యత ను తీసుకోవాలని అన్నారు. గ్రామాలలో శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పల్లెలలో వివాదాలకు పాల్పడే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రేషన్ కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ లో క్షేత్ర స్థాయిలో ఉన్నది ఉన్నట్లు గా రిపోర్ట్ ఇవ్వాలని అన్నారు. చిన్న తప్పిదం చేసినా బాధ్యులు అవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, ఏఎస్సై సీతారాములు, ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.



# కూసుమంచిలో ఎస్సీ,బీసీ నేతల సంబరాలు..

### సీఎంతో పాటు మంత్రులకు పాలాభిషేకం చేసిన నాయకులు..

**కూసుమంచి, ఫిబ్రవరి 5, మహా:** అసెంబ్లీలో బీసీ కుల గణన తో పాటు ఎస్సీ వర్గీకరణను ఆమోదించిన సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీల, బీసీలు, ఎస్టీలు ఘనంగా సంబరాలు చేశారు. బుధవారం ఎస్సీ మండల కమిటీ అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు, ఎస్సీ సంఘం, బీసీ సంఘం నాయకుల ఆధ్వర్యంలో కూసుమంచి మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో ఘనంగా సంబరాలు చేశారు. అసెంబ్లీలో కుల గణన ను, ఎస్సీ వర్గీకరణను అమోదింపజేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కూసుమంచి మాజీ ఎంపీటీసీ, మాదాసు ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ అమలు చేసిన తరువాత దళితులకు అనేక రకాల మేలు చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా నిలిచిందన్నారు. గడిచిన 30ఏళ్ళ నుంచి ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలందరు పోరాటం చేశారని, పదేళ్ళ పాటు కేంద్రాన్ని, రాష్ట్రాన్ని పాలించిన గత పాలకులు ఎవరు పట్టించుకోలేదని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మాదిగలకు దేవుడిలా వచ్చి ఎవరు ఎన్ని చేసినా వర్గీకరణ అమలు చేయడం



హర్షనీయమని అన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూనే సీఎం రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులందరికి ధన్యవాదాలు తెలిపారు. మాదిగలందరికి అభినందనలు తెలిపారు.

### ఏం చేయాలన్న కాంగ్రెస్ తోనే సాధ్యం..

బీసీలకు 42 శాతం అమలు రిజర్వేషన్లు చేస్తూ అసెంబ్లీ లో అమోదం తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ బీసీ, మైనారిటీ నాయకులు పెంద్ర అంజయ్య, ఎండీ.ఖలీమ్, బారీ వీరభద్రం ధన్యవాదాలు తెలిపారు. ఏం చేయాలన్న, పేదలకు న్యాయం చేయాలన్న, బీసీలు, దళిత, గిరిజనులకు ప్రముఖ స్థానం కల్పించాలన్న కాంగ్రెస్ పరిపాలన లోనే సాధ్యమైందన్నారు. బీసీ ప్రజలందరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యడవల్లి ముత్తయ్య, మాజీ సర్పంచ్ చాట్ల పరుశురాం, నాయకులు బెల్లంకొండ కిరణ్ కుమార్, అర్వపల్లి మల్లిఖార్జున్, జనార్ధన్, కనకం మైసయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాట్ల సత్యనారాయణ, కొండా మహిపాల్, కణితాల నాగన్న, ఎస్ కె. మీరా, బెజవాడ శ్రీకాంత్, శేఖర్ రెడ్డి, సైదులు నాయక్, శోభన్ నాయక్, ఇతర పార్టీల నాయకులు మాతంగి రామస్వామి, ఇరుగు వెంకన్న, ఎస్సీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు, మండలం నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు'

# ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చారిత్రాత్మకం

### మాదిగల దామాషా ప్రకారం 11 శాతం రిజర్వేషన్ లను అమలు జరపాలి

### కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు

**ఖమ్మం సిటి, ఫిబ్రవరి 5 ,మహా:** మూడు దశాబ్దాల కాలంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో సమన్యాయం, సామాజిక న్యాయం ఉందని సుప్రీంకోర్టు తీర్పుకు అనుకూలంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు అన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కోటా రాంబాబు మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, అనగారిన వర్గాలకు చెందిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీలోని 59 ఉపకులాలకు దామాషా ప్రకారం సమన్యాయం, సామాజిక న్యాయంకోసం జరుగుతున్న పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం చారిత్రాత్మకమన్నారు. ఏక్ సభ కమిషన్ జస్టిస్ షమీం అక్తర్ రిపోర్ట్, సబ్ కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్కా సహకారంతో ఎస్సీ వర్గీకరణను చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు




ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వర్గీకరణ ఉద్యమంలో ఎంతోమంది అమరులయ్యారని, జైలు పాలయ్యారని అయినప్పటికీ ఉద్యమాన్ని ముందుకు నడిపి వర్గీకరణ విజయాన్ని ముద్దాడిన మాన్యశ్రీ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగన్నకు శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నానన్నారు. ఎస్సీ వర్గీకరణలో మాదిగ, మాదిగ ఉపకులాలకు 9శాతం కాదు దామాషా ప్రకారం 11శాతం రిజర్వేషన్ ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు వేల్పుల నరసింహారావు, నాయకులు ఎర్రగుట్ట రమేష్, లంకా వెంకటేశ్వర్లు, ఊదగాని రంజిత్, గుండ్ల రత్నబాబు, కనకం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# అవకాశాలను పుణికిపుచ్చుకోవాలి



**మహిళలు అర్ధికంగా ఎదగాలి**

**మహిళా ప్రాంగణం సేవలు అభినందనీయం**

**శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నం**

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ఖమ్మం , ఫిబ్రవరి -05:మహా:** నైపుణ్యతతో కూడిన వ్యాపారం సృష్టించుకొని మరొకరికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. బుధవారం నగరంలోని టేకులపల్లిలోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం మహిళా ప్రాంగణంను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉపాధి శిక్షణ పొందుతున్న మహిళలు కలెక్టర్ కు పూలమొక్కలు అందించి ఘనంగా స్వాగతించారు.మహిళా ప్రాంగణం అధికారిణి వేల్పుల విజేతతో కలిసి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మహిళా ప్రాంగణం పరిసరాలను కలియ తిరిగి కావాల్సిన మౌళిక సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళలకు అందిస్తున్న వృత్తి విద్యా కోర్సులు, ఉపాధి శిక్షణ టైలరింగ్, ఏఎన్ఎం నర్సింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, టైపింగ్, ట్యాలీ, అకౌంటింగ్, కంప్యూటర్, డీసీఏ, డీటీపీ, డ్రైవింగ్, బ్యూటిషియన్, మగ్గం వర్క్స్, తదితర కోర్సులు, టీచింగ్ రూమ్స్, డైనింగ్ హాల్ లను పరిశీలించారు. మహిళలకు స్వయం ఉపాధి సహకారానికి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి సిబ్బంది పనితీరుకు కితాబు ఇచ్చారు. నర్సింగ్, కంప్యూటర్ విద్య, టైలరింగ్‌లో వృత్తి శిక్షణ పొందుతున్న మహిళలు, విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ నిచ్చి వారికి స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జిల్లా మహిళా ప్రాంగణంలో ట్రైనింగ్ ఇస్తున్నామని అన్నారు. నేటి సమాజంలో పోటీ ప్రపంచానికి ధీటుగా ప్రతీ మహిళకు శిక్షణ అందించి జీవనోపాధి పొందే విధంగా మహిళా ప్రాంగణం ద్వారా పూర్తి భరోసా లభిస్తుందని తెలిపారు. ఆడపిల్లలు అర్థికంగా గొప్ప స్థాయికి ఎదగడం కోసం కేవలం ఉపాధి కల్పనలోనే కాకుండా వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించడానికి కూడా శిక్షణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కేవలం శిక్షణ వరకే పరిమితం కాకుండా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి కూడా కల్పిస్తున్నామని చెప్పారు. శిక్షణ తర్వాత సబ్సిడీ రుణాలు కూడా ఇప్పించేందుకు మహిణా ప్రాంగణం సహకరిస్తుందని అన్నారు. ఎం.పి.హెచ్.డబ్ల్యు. / ఏ.ఎన్.ఎం కోర్సుల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన మహిళా ప్రాంగణం నర్సింగ్ విద్యార్థులను కలెక్టర్ అభినందించి, మెమెంటోలను బహుకరించారు. విద్యార్థిను లకు స్టడీ, ఉపాధి అవకాశాల మెటిరియన్ ను అందించారు. వరుసగా రెండోసారి కూడా రాష్ట్ర స్థాయి ర్యాంకులను మహిళా ప్రాంగణం కైవసం చేసుకున్నందేకు కృషి చేసిన మహిళా ప్రాంగణం అధికారిని వేల్పుల విజేత ను శాలువాతో కలెక్టర్ సన్మానించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థినులు, శిక్షణ పొందుతున్న మహిళాలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం సిబ్బంది సరస్వతి, స్పందన, హిమ బిందు, మల్లిక, విజయ్ కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, పల్లవి, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి తదితరులు ఉన్నారు.

# స్మశాన భూమిపై వివాదం

- ముస్లింలు, ఎస్సీల మధ్య తీవ్ర వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం




**తల్లాడ, ఫిబ్రవరి 5 , మహా:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామంలో స్మశాన వాటిక భూమి వివాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. ముస్లింలు, ఎస్సీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్సీ కాలనీకి ఆనుకుని స్మశాన వాటికలు ఉండటంతో మాకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే ఇతర ప్రదేశంలో స్మశాన స్థలం కేటాయించాలని ఎస్సీలు డిమాండ్ చేశారు. ప్రస్తుత భూమిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో ముస్లింలు స్మశాన భూమికి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టగా, ఎస్సీలు నిరసన వ్యక్తం చేస్తూ పనులను అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య వాగ్వాదం తీవ్రమవడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వైరా ఏసిపి ఎం.ఏ.రహమాన్, సిఐ సాగర్, ఎస్సై కొండలరావు పోలీస్ బలగాలతో ఘటన స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలతో చర్చలు జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచించారు.



# సాఫ్ట్వేర్ కంపెనీ ఐబిఎంతో యస్‌బిఐటి అవగాహనా ఒప్పందం

**ఖమ్మం సిటి, ఫిబ్రవరి 5, మహా:** విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఎప్పటి కప్పుడు నైపుణ్యాలకు పదును పెట్టడం ద్వారా తమ కెరియర్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సి. ఎస్.ఆర్ బాక్స్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఐ.బి.ఎం. తో యస్.బి.ఐ.టి. కళాశాల అవగాహేనా ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన సదస్సులో సంస్థ ప్రతినిధితో అవగాహనా ఒప్పందం తో పాటు విద్యార్థులకు ఓరియంటేషన్ అందించారు. గత 9 సంవత్సరాలుగా జరుగుతున్న సంస్థ కార్యక్రమాలను తెలపడంతో పాటు విద్యార్థులకు సంస్థ అందించే శిక్షణా విధానాన్ని వివరించారు. ట్రైనింగ్స్, ఇంటర్న్‌షిప్స్, జాబ్ రెడినెస్ మరియు జాబ్ అసిస్టెన్స్ అందించటంలో సుమారు దశాబ్దం అనుభవం ఉన్న సి.యస్.ఆర్. బాక్స్ ఫౌండేషన్తో అవగాహేన వల్ల తమ విద్యార్థులకు కావలసిన నైపుణ్యాలను ఉచితంగా అందించగలమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. ఉత్తర భారతదేశంలో ఎక్కువగా వ్యాపించి ఉన్న సి.యస్.ఆర్. బాక్స్ ఫౌండేషన్ ఖమ్మంలో తమ కళాశాలకు అవకాశం అందించటం తమపై మరింత బాధ్యతను పెంచిందని వారు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని నైపుణ్యాభివృద్ధి చెందాలని వారు ఆశించారు. ఈ కార్యక్రమంలో సి.యస్.ఆర్. బాక్స్ ఫౌండేషన్ సీనియర్ ఎంగేజ్ మెంట్ అసోసియేట్ రాజగోపాల్ నాయుడుతో పాటు కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, డాఎం యస్. శ్రీనివాసరావు, హెచ్.ఓ.డి.లు డాఎం కె. అమిత్ బింధాజ్, డా? కె. స్ఫూర్తి, టి.పి.ఒ. యస్. సవిత, కోఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





# పెట్టుబడులు వస్తాయా?

## పెరిగిపోతున్న ఎన్నికల ఖర్చు

## మళ్లీ రంగంలోకి దిగేందుకు వెనుకంజ వేసే నేతలు

## అధికార మార్పుతో మారిన లెక్కలు మళ్లీ 'హస్తం' వైపే మొగ్గు

## బిల్లుల కోసం మాజీ సర్పంచుల ప్రదక్షిణలు

## మీమాంసలో పడ్డ స్థానిక నేతలు

**ఖమ్మం, ఫిబ్రవరి 5, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల మేళా మొదలయ్యింది. గత ప్రభుత్వ హయాంలో పాలన చేపట్టిన సర్పంచులు అభివృద్ధి పనుల పేరుతో అప్పులు చేసి, వాటి బిల్లుల కోసం అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. పదవి ముగిసి ఏడాది దాటినా బిల్లులు విడుదల కాకపోవడంతో, కోట్లలో ఖర్చు చేసిన సర్పంచులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ముంచుకొస్తున్న వేళ, మళ్లీ పోటీ చేయాలా? వద్దా? అనే ప్రశ్న వారిని వేధిస్తోంది.

### బిల్లుల కోసం తలలు పట్టుకున్న మాజీలు

గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసిన తీరును బట్టి అభివృద్ధి పనులు నిర్వహించారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక వసతుల కోసం అప్పులు చేసి, ప్రభుత్వానికి బిల్లులు సమర్పించినా వాటి చెల్లింపులు ఇప్పటి వరకు జరగలేదు. అధికారం మారడంతో కొత్త పాలకులు వెనుకబడిన బిల్లుల చెల్లింపులపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే వాదన వినిపిస్తోంది. పంచాయతీలకు నిధుల కొరతతో స్థానికంగా ప్రజా సమస్యలు పెరిగిపోతున్నాయి.

### మళ్లీ రంగంలోకి దిగితే పరిస్థితి ఏమిటి?

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తే, మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ సర్పంచులు వెనుకంజ వేస్తున్నట్లు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఖర్చు పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించుకునేందుకు ప్రభుత్వానికి ఆశపడినా, నిధుల విడుదల కష్టమవ్వడంతో వారిలో భయం నెలకొంది. గడచిన ఎన్నికల్లో విజయం సాధించేందుకు 30 లక్షల నుంచి కోటి రూపాయల వరకు సర్పంచ్ అభ్యర్థులు ఖర్చు చేసినట్టు అంచనా. అదే ఎంపీటీసీ పోటీదారులకు 20 నుంచి 50 లక్షల వరకు ఖర్చు అయినట్లు సమాచారం. నూతనంగా ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థులు కూడా ఖర్చు తడవుతోనే ముందుకు వెళ్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో పనిచేసిన నేతలు ఇప్పటికీ బిల్లుల కోసం తిరుగుతున్న వేళ, కొత్త అభ్యర్థులు ఎన్నికల ఖర్చుతో పాటు భవిష్యత్తులో పెట్టుబడిని తిరిగి పొందగలమా? అనే ప్రశ్నకు సమాధానం వెతుకుతున్నారు.

### ఎన్నికల తర్వాత ఎవరి దారి?

ఎన్నికల ఖర్చు పెరిగిన నేపథ్యంలో పోటీచేసే అభ్యర్థుల దృష్టి అధికార పార్టీ వైపు మళ్లినట్టు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గెలిచిన తర్వాత అభివృద్ధి పనులకు నిధులు రావాలంటే అధికార పార్టీ ఆశీస్సులు ఉండాలి. గతంలో టీఆర్ఎస్ హయాంలో ఇదే మాదిరిగా చోటుచేసుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నా, గ్రామపంచాయతీలకు నిధుల విడుదల నిలిపివేయడంతో పరిస్థితి మారింది. ఇకపై కూడా అధికార పార్టీ నుంచి నిధులు వస్తాయా? స్థానిక సంస్థల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తుందా? లేక పంచాయతీలను ఆర్థికంగా దివాళా తీయిస్తారా? అనే అంశాలపై నేతలు కసరత్తు చేస్తున్నారు.

### హస్తం వైపే మొగ్గు

ఎవరైతే ఈ ఎన్నికల్లో గెలుస్తారో, వారు చివరికి అధికార పార్టీ వైపే వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టిన వారు ప్రభుత్వ మద్దతు లేకుండా నిధులు పొందడం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో గెలిచిన వారిలో చాలామంది చివరికి అధికార పార్టీ వైపే మళ్లారు. ఈసారి కూడా అదే పరిస్థితి కొనసాగుతుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### కాంగ్రెస్ హామీలు - వాస్తవ పరిస్థితి

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఇప్పటికీ ప్రారంభ దశలోనే ఉంది. పంచాయతీలకు నిధులు రావడం లేదనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. గ్రామస్థాయిలో పలు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో, సర్పంచులు ప్రభుత్వం వైఖరిపై అసంతృప్తితో ఉన్నారు.

### తర్జనభర్జనలో అభ్యర్థులు

ప్రస్తుతం ఎన్నికల సమరం ముంచుకొస్తుండగా, పోటీచేయాలా? వద్దా? అనే ఆలోచనలో స్థానిక నేతలు ఉన్నారు. గతంలో ఖర్చు పెట్టిన అభ్యర్థులకు బిల్లులు రావడం లేదు. ఇప్పుడు మళ్లీ ఖర్చు పెడితే తిరిగి ఆ పెట్టుబడులు వచ్చాయనే భరోసా లేదు. ఇలాంటి సమయంలో కొత్తగా పోటీ చేసేవారు ఎన్నికల ఖర్చును ఎలా భరించగలుగుతారనే అంశం చర్చనీయాంశంగా మారింది.

### ఫలితాలు ఏవైనా - రాజకీయ మార్గం స్పష్టమే!

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు గెలిచినా, చివరికి అధికార పార్టీ వైపే మొగ్గుచూపాల్సిన పరిస్థితి నెలకొంది. నిధులు అవసరమైన నాయకులు అధికార పక్షం నుంచి సహాయాన్ని ఆశించకుండా ఉండలేరు. గత ప్రభుత్వ హయాంలోనూ ఇదే పరిస్థితి ఉండగా, ఇప్పుడు మారే సూచనలు కనిపించడం లేదు. ఇలాంటి సంక్లిష్ట రాజకీయ వాతావరణంలో గెలుపొందిన వారికే కాదు, పోటీచేసే అభ్యర్థులకూ ముందున్న మార్గం క్లిష్టంగానే ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ఉమ్మడి ఖమ్మం జిల్లా

| | |
|---|---|
| ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలు | థర్డ్ జెండర్స్ ఉమ్మడి జిల్లాలో 46 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 గ్రామపంచాయతీ | |
| ఖమ్మం జిల్లాలో వార్డులు 5,389 | |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వార్డులు 4,314 | ఖమ్మం జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 288 |
| ఖమ్మం జిల్లాలో ఓటర్ల సంఖ్య 8,52,879 | |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓటర్ల సంఖ్య 6,23,947 | |
| ఖమ్మం<br>పురుష ఓటర్లు 4,13,048<br>మహిళా ఓటర్లు 4,39,808 | భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంపీటీసీ స్థానాలు 236 |
| భద్రాద్రి కొత్తగూడెం.<br>పురుష ఓటర్లు 3,04,264<br>మహిళా ఓటర్లు 3,19,660 | |